# గోమాత

మనది 'గోభూమి' అని అందరూ అనుకుంటారు. మీరుకూడా అదే విధంగా చెబుతూ వుంటారు; గోపూజకు మన దేశం, ప్రసిద్ధి—అని. పలువురుచెప్పుకోవటంనేనువిన్నాను. మీరు మాటాడితే 'కామధేనువు, కల్పవృక్షం' అనటం కూడా నేను ఎరుగుదును, కాని నిజంగా మీరు ఈ దేశం లోని గోవుల సంగతి, ఆలోచిస్తున్నారా ?

మీరు పూజలు చేస్తున్నామని చెప్పుకునే గోవులలో నేనొకదాన్ని. నన్ను చూడండి. నేను మీచేత పూజలు అందుకుంటున్నదానికివలే వున్నానా ? నాది, నడివయసే అయినప్పటికీ, అడుగు వెయ్యలేకుండా వున్నాను. నా శరీ రం నాకే భారంగా వుంది. నా యజమాని నాముందు విదిలించే నాలుగు పరకలే, కొరుకూడు పడనిస్థితిలోవున్నాను. పూర్వం ఒకప్పుడు మా జాతిని కన్నతల్లులను చూచుకున్నట్లు చూచుకునేవారు. గోవు ఎదురు పడితేనే అదృష్టం అనుకునే వారట. ఇంటిలో గోవు ఒకటివుంటే ఇల్లంతా కళకళలాడు తున్నట్లు సంబరపడేవారట. ఇప్పుడా భావం ఏది ?

పోనీ మీరే చెప్పండి. మీకు అనేకచోట్ల నాజాతి కనిపిస్తూ వుంటుంది. అవి, మీచేత పూజింప బడుతున్నట్టు గానే వున్నాయా ? ఈసురోమని, అంటుడొక్కలతో తిరిగే, వాటిని మీరు శ్రద్ధగా చూచివుండరు. వాటి కళ్ళ ల్లోని వేదన మీరు గమనించి వుండరు.

వేటి సంగతో దేనికి? నా సంగతి చెప్పుకుంటాను. కాస్త ఓపికపట్టి వింటారా? నన్ను నా యజమాని ఒక సంతలో కొని, తన కొట్టంలోనికి తోలుకొని వచ్చాడు. అంతకుముందు నన్ను పెంచిన యజమాని పూర్వకాలపు మనిషి. నన్ను పువ్వులలో పెట్టి పెంచినట్లు పెంచాడు. ప్రతి రోజూ తెల్లవారకముందే లేచి, పనిపాటల్లోకి వెళ్ళకముందు నన్ను లేపి, నా మేను నిమిరి, నాముందు జనపకట్ట వేసి, నా దగ్గర బాగుచేసి, నా మొహంలోకి ఒక్కసారి చూచి మరీ వెళ్ళేవాడు. ఉదయం లేచి నా మొహం చూడకుండా ఎవరి మొహం చూచేవాడు కాదు. నన్ను చూచి బయటకు వెళ్తే పనులన్నీ ఇట్టే అయిపోయేవట ఆయనకి. అదీ ఆయన నమ్మకం. ఒచ్చినవారందరికీ నన్ను చూపి, 'ఇది మాయింటి శ్రీ మహాలక్ష్మి. ఇది వున్నచోట ఏ కొరతా వుండదు. దీన్ని నేను ఏ పరిస్థితిలోనూ విడువను' అని చెపుతూ వుండేవాడు.

ఈమాట ఆయన పదేపదే అంటూవుంటే నాకు భయం వేసింది. ఎందుకు, నన్ను విడువనని, ఈయన ఇంత మందికి ఇన్నిసార్లు చెప్పాలి. నన్ను విడిచిపెట్టవలసిన అవసరం ఈయనకు కలగటం లేదుగదా! ఈ ఆలోచన నాకు తట్టగానే, నా శరీరం కంపించింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగినై. చివరికి నా భయం నిజమే అయింది. నా యజమాని ఆర్థికంగా చితికిపోవటంవల్ల నన్ను అమ్మటం తప్పనిసరైంది. ఒకరోజున నన్ను సంతకు తోలుకువెళ్ళాడు. అప్పటికి నాకొక పెయ్యదూడకూడా. నేనూ నావెంట నా దూడా, యజమాని వెనక అడుగులో అడుగు వేసుకుంటూ బయలు

దేరాం. నా బిడ్డ నడవలేకపోతే నా యజమానే దాన్ని సంతదాకా మోశాడు. బేరం చేసికొన్నాడు. నన్ను కొనటం అంటే నన్ను, నా బిడ్డను కొన్నట్లే; నాబిడ్డకేం తెలుసు, యీ బాధ? అది పసిది. దానికి ఎంతోమంది రైతులూ, ఎంతోమంది స్వజాతీయులూ ఒక్కసారిగా కనబడటం సంతోషకారణం అయింది. చేతుల్లో నిలవకుండా గంతులు వేయటం మొదలుపెట్టింది. దాని అమాయకత్వానికి నా గుండె చెరువు అయింది. కాని నేనేం చెయ్యగలను! నాబాధ దానికి ఎలా వెళ్ళబోసుకోను? నన్ను తీసుకు వెళ్ళడానికి నా కొత్త యజమాని నా మెడ పలుపు పట్టుకున్నాడు. నేను నా పాతయజమాని వంకకు దీనంగా చూశాను. ఆయన కళ్లు చెమ్మగిల్లటం చూశాను. ఆయన వేదనకు నా కడుపు తరుక్కొని పోయింది. నేనుమాత్రం ఏం చెయ్యగలను? నా కాయనతో వున్న ఋణానుబంధం తెగిపోయింది - అనుకున్నాను. నా కొత్త యజమానివెంట బయలుదేరాను. నాతోపాటు నా బిడ్డకూడా బయలుదేరింది. చేతులు మారటంలో వచ్చే యాతన దానికేం తెలుసు? రాబోయే రోజులు ఎలా వుంటవో-అని నేను ఆవురుమంటూ వుంటే, అది వున్న చోట వుండకుండా చెంగలించింది.

మేము మా కొత్త యజమాని కొట్టంలోకి వచ్చాం. ఇక మా పరిస్థితులన్నీ తారుమారైనై. మా కొత్త యజమాని, మమ్మల్ని ఇంటింటికి తోలుకొని వెళ్ళి, పాలు పిండి, అమ్ముకుంటూ వుండేవాడు. మొదట్లో నా బిడ్డకు ఒక పక్క విడిచిపెట్టేవాడు. నెమ్మదిగా అదికూడా లేకుండా చేశాడు.

నా బిడ్డను చేపుకు వదలగానే అది ఆకలిమీద వుండేదేమో, 'ఆవురు, ఆవురు' మంటూ రివ్వున పరుగెత్తుకొని వచ్చేది. అది దగ్గరకు వచ్చేటప్పటికీ నా వళ్ళు జలదరించి, పాలు చేపుకి వచ్చేవి. కాని నా బిడ్డను పాలు త్రాగనిచ్చే దెవరు? చేపుకు వచ్చిన పాలు, త్రాగనివ్వకుండా, నా యజమాని నా బిడ్డను బలవంతంగా గుంజుకువెళ్ళి కట్టివేసేవాడు. నోటి దగ్గరకు వచ్చిన పాలకు దూరమై అది గిజగిజ తన్నుకుంటూ వుంటే, నా ప్రాణాలు విలవిలలాడేవి. నేను ఎందుకుపుట్టానో, ఎందుకు పాలనిస్తున్నానో, ఎందుకు బ్రతుకుతున్నానో నాకు అర్థం అయ్యేదికాదు. నా యజమాని నా పాలను పితికి, అమ్ముకొని డబ్బు సంపాదించటం తప్పని నేను ఎప్పుడూ అనుకోలేదు. కాని నా బిడ్డసంగతి ఏమిటి? బిడ్డకు బ్రతికే అర్హత లేదా? తల్లిపాలను రుచిచూచే భాగ్యానికి అది నోచుకోలేదా? నా బిడ్డను సాకుకునే అదృష్టం లేని తల్లిని నేనేం తల్లిని?

పాలులేక, ఆహారంలేక, నా బిడ్డ నా కళ్ళముందే నీరసించిపోయింది. చిక్కి, వరుగై పోయింది. నేనే గుర్తుపట్ట లేకపోయాను. ఒకరోజు నాబిడ్డ నాతో రాలేదు. ఎందుకా అని ఆలోచించాను. ఈవిధంగా తల్లినీ, బిడ్డనీ విడదియ్యడం ఎంతో అన్యాయం. నాలుగురోజులు గడిచినై. నా బిడ్డ కొట్టంలోకూడా లేదు. నాకు కంపరం పుట్టింది. కంపరంతో, కోపంతో పాలివ్వకుండా ఎగచేపుకున్నాను. అందుకు నన్ను నా యజమాని నిర్దాక్షిణ్యంగా చావమోదాడు. ఏమైనా సరే, పాలు ఇవ్వగూడదు, ప్రాణాలకు తెగించి నిలబడ్డాను.

మరునాడు నా యజమాని నాతోపాటు ఒకదూడను మోసుకొని వచ్చాడు. అది నా బిడ్డేనని నేను మురుసుకొన్నాను. నేను దెబ్బలు తింటే తిన్నాను- ఫలితం దక్కిందని సంతోషించాను. నాకు బంధంవేసి, నా బిడ్డను పొదుగు దగ్గరకు తీసుకువచ్చాడు నా యజమాని. నాకు ఒళ్ళు పొంగింది. పరవశమయ్యాను. కాని ఇదేమిటి? ఇదేం స్పర్శ! అది నా పొదుగును తాకిందో, లేదో నేను రహస్యం గ్రహించాను. అది గడ్డిదూడ. దానికి ప్రాణంలేదు. నా బిడ్డ తిండికి లేక అది అప్పుడే మరణించింది. నేను పాలివ్వటంలేదని, ఈ గడ్డి దూడను కుట్టి, తీసుకువచ్చాడు నా యజమాని. నేను గ్రహించలేను అనుకున్నాడు. ఏమీ దారుణం! తనబిడ్డ స్పర్శ గ్రహించలేని తల్లి ఉంటుందా? నా శరీరం భుగభుగ ఉడికింది. నా పాలమీద బ్రతికే హక్కు- నా బిడ్డకు లేకపోయింది. నా బిడ్డను నా పాల తడితో బ్రతికించుకునే యోగ్యత నాకు లేకపోయింది. ఇక నన్నిలా కృశించి మరణించనివ్వండి. ప్రస్తుతం మరణంకోసం ఎదురు చూస్తూ, కాలం గడుపుతున్నాను. నేను చచ్చేం; బ్రతికేం? ప్రపంచం ఏమైపోతే నాకేం!